ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801
S.R - 9551168092

27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

పేద మహిళకు గవర్నర్ కానుక

● ఆర్ఎన్ రవి వితరణ

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో అద్దె ఆటో డ్రైవర్‌గా చాలీచాలని సంపాదనతో ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్న అమల అనే మహిళకు గవర్నర్ ఆర్ఎన్ రవి కొత్త ఆటోను కానుకగా అందజేసి ఆమెకు విస్మయం కలిగించారు. మార్చిలో రాజ్‌భవన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభలో లేడీ ఆటో డ్రైవర్ అమల కుటుంబపోషణ కోసం తాను పడుతున్న కష్టాలను వివరిస్తూ, అద్దె ఆటోను నడుపుతున్న తనకు సొంత ఆటో ఉంటే బాగుంటుందని పేర్కొన్నారు. అమల తమిళంలో మాట్లాడిన మాటల అర్థాన్ని గవర్నర్ రవి తన సహాయకుల ద్వారా తెలుసుకున్నారు. ఆమెకు వీలైనంత త్వరగా కొత్త ఆటోను కానుకగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గవర్నర్‌ను కలుసుకోవాలంటూ అమల, ఆమె ఇద్దరు పిల్లలకు రాజ్‌భవన్ నుంచి పిలుపందింది. ఈ మేరకు అమల, ఆమె ఇద్దరు పిల్లలు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మరాద్యపూర్వకంగా కలుసుకున్నప్పుడు ఆ ముగ్గురిని లాన్‌లోకి తీసుకెళ్లి అక్కడే నిలిపి ఉంచిన ఆటోను చూపి 'ఆ ఆటో నీ సొంతం' అని చెప్పారు. గవర్నర్ పలికిన ఆ మాటకు అమల ఆశ్చర్యపోయింది. నాలుగు నెలలకు ముందు తాను సభలో చెప్పిన మాటలను గుర్తుంచుకుని, తను పడుతున్న కష్టాలను గుర్తించి ఆటోను కొనిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపింది. ఆ తర్వాత గవర్నర్ రవి... అమల, ఆమె పిల్లలకు తేనీటి విందునిచ్చి ఆటో తాళాలను అందజేశారు. అమల కొత్త ఆటోలో గవర్నర్, తన ఇద్దరు పిల్లలను ఎక్కించుకుని రాజ్‌భవన్ అంతటా తిప్పింది. చివరగా గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలుపుకుని అమల, ఆమె పిల్లలు రాజ్‌భవన్ నుంచి కొత్త ఆటోలో ఇంటికి బయలుదేరారు.



గవర్నర్ ఆర్ఎన్ రవి, ఆమె పిల్లలను ఎక్కించుకుని ఆటో నడుపుతున్న అమల

ఇంతటి ప్రజాదరణ లభించడం అదృష్టం

7 లో

● హిజ్రా బ్యూటీ అనుశ్రీ



పరందూరు వద్ద కొత్త రైల్వేస్టేషన్ 8 లో

మేట్టూరు డ్యాంలో ఫ్లడ్ కంట్రోల్ రూం

ద్విభాషా చిత్రాలపై కోలీవుడ్ హీరోల మొగ్గు 7 లో

ఫుట్‌బోర్డుపై ప్రయాణించే విద్యార్థులపై కేసులు

● పోలీసులకు హైకోర్టు సూచన

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు బస్సు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరమైన స్థితిలో ప్రయాణిస్తే వారిపై తగిన చర్యలు చేపట్టవచ్చని, పోలీసులు కేసులు నమోదు చేయాలని హైకోర్టు మదురై బెంచ్ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు ఆయా విద్యా సంస్థల బస్సులు, ప్రభుత్వ బస్సుల్లో వెళ్తుంటారు.



అలా వెళ్లే విద్యార్థులు ఫుట్‌బోర్డులపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు బస్సులో రద్దీ ఉన్నా, లేకున్నా విద్యార్థులు ఫుట్‌బోర్డుపైనే వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు బస్టాండ్‌లలో విద్యార్థులు ఫుట్ బోర్డు ప్రయాణించవద్దని హెచ్చరిస్తున్నా, వారు పాటించడం లేదు. అలాగే, ఫుట్‌బోర్డు నుంచి లోపలికి రావాలంటూ విద్యార్థులను హెచ్చరిస్తున్న బస్సుడ్రైవర్, కండక్టర్లపై విద్యార్థులు దాడి చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ విషయమై తూత్తుకుడికి చెందిన రామ్‌కుమార్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో... రాష్ట్రంలో 1 - 12వ తరగతి వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ఐటీఐ, పాలిటెక్నిక్‌లలో చదివే విద్యార్థులు ప్రభుత్వ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీంతో, బస్సుల్లో రద్దీ అధికంగా ఉంటోందన్నారు. కొన్ని సమయాల్లో విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయన్నారు. వీటిని అరికట్టేలా నిర్ణీత సమయాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడిపేలా ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారించిన జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం నేతృత్వంలోని ధర్మాసనం... విద్యార్థులకు తల్లిదండ్రులు సూచనలు, సలహాలు అందిస్తూ పెంచాలని, ఇది వారి విధి అన్నారు. ఇటీవల విద్యార్థులు ధూమపానం, మాదకద్రవ్యాలకు బానిసలు కావడం అధికమవుతోందని, పాఠశాలల వద్ద పోలీసు భద్రత కల్పించాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణించడంపై పలు ఆరోపణలున్నాయని, సూచనలు, సలహాలు అందించినా పాటించడం లేదని తెలుస్తోందన్నారు. ఇలాంటి చర్యలు శిక్షార్హమైన నేరం అని, అలాంటి వారిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేయవచ్చని ఆదేశించారు. సాధ్యమైనంత వరకు విద్యార్థులు బస్సు లోపల ఉండేలా చర్యలు తీసుకోవాలని, అతిక్రమించిన విద్యార్థులపై పోలీసులు తగిన చర్యలు చేపట్టవచ్చని సూచిస్తూ, కేసు విచారణ ముగిసినట్లు ప్రకటించారు.

ఇంజనీరింగ్ అడ్మిషన్ ర్యాంకుల జాబితా విడుదల

● 14న కౌన్సెలింగ్ ప్రారంభం

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరానికి బీఈ, బీటెక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్ల ర్యాంకుల జాబితాను ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ విడుదల చేశారు. గిండీలోని సాంకేతిక విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం ఉదయం జాబితాను విడుదల చేశారు. అన్నా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా సుమారు 445 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి త్వరలో కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ కాలేజీల్లో ప్రభుత్వ కోటా కింద 2 లక్షలకు పైగా సీట్లు భర్తీ అవుతాయి. ఆ నేపథ్యంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మే 7న ప్రారంభమై ఈనెల 6న ముగిసింది. ఈ మేరకు 3,02,374 మంది విద్యార్థులు తమ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో 2.49 లక్షల మంది రుసుము చెల్లించారు. ఈ నెల 11న ర్యాండం సంఖ్యల కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఇంజనీరింగ్ ర్యాంకుల జాబితా ప్రకారం 145 మంది అభ్యర్థులు 200లకు 200 మార్కులు పొంది ఉన్నారని, రాష్ట్రంలో జనరల్ కేటగిరీ అభ్యర్థులకు జూలై 14న కౌన్సెలింగ్ ప్రారంభమై ఆగస్టు 17వరకు కొనసాగుతుందని చెప్పారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థులకు జూలై 7న కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. 7.5శాతం రిజర్వేషన్ కింద కడలూరుకు చెందిన విద్యార్థిని ధరణి ఫస్ట్ ర్యాంకు సాధించిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 7.5 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికగా 51,004 మంది దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. కంప్యూటర్ సదుపాయం లేని గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆయా జిల్లాల్లో ఉన్న సహాయ కేంద్రాలకు వెళ్లి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని చెప్పారు.



బీఈ, బీటెక్ ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించి ర్యాంకుల జాబితాను విడుదల చేస్తున్న ఉన్నత విద్యాశాఖమంత్రి కోవి చెళియన్

టాప్ టెన్ ర్యాంకర్లు...

ఈ సమావేశంలో 200 కటాఫ్ మార్కులతో టాప్‌టెన్ ర్యాంకుల్లో నిలిచిన అభ్యర్థుల వివరాలను, 7.5 రిజర్వేషన్ ప్రకారం టాప్‌టెన్ ర్యాంకులు పొందిన అభ్యర్థుల వివరాలను మంత్రి ప్రకటించారు. ఆ మేరకు కాంచీపురానికి చెందిన సాగస్రా, నామక్కల్ నల్లపాళయం కొంగునాడు మెట్రిక్యులేషన్ స్కూలు విద్యార్థిని కార్తీకా ఎస్, అరియలూరు జిల్లా ఉడయార్‌పాళయం కోకిలాంబాళ్ స్కూలు విద్యార్థి అమలన్‌ఆంటో, ధారాపురం వివేకం స్కూలు విద్యార్థి కృష్ణప్రియాన్ కే, కడలూరు వల్లలార్ హయ్యర్ సెకండరీ విద్యార్థి దీపా జి, కడలూరు శ్రీముష్ణం విద్యార్థిని దీపికా, తిరుప్పూరు అమ్మాపాళయం శ్రీరామకృష్ణా విద్యాలయ స్కూలు విద్యార్థి విశాల్‌రామ్, దిండుగల్ ఎస్ఎంబీఎం స్కూలు విద్యార్థిని పవిత్ర ఆర్వీ, తిరుప్పూరు జిల్లా కాంగేయం స్వామివివేకానంద స్కూలు విద్యార్థి శుభశ్రీ పి, తిరుప్పూరు జిల్లా వికాస్ విద్యాలయ విద్యార్థి కోధై కామాక్షి ఆర్ 200 కటాఫ్ మార్కులతో తొలి పది ర్యాంకులు సంపాదించుకున్నారని మంత్రి కోవి చెళియన్ ప్రకటించారు. ఇదే విధంగా 7.5 ప్రభుత్వ రిజర్వేషన్ ప్రకారం కడలూరు కండమంగళం స్కూలు విద్యార్థిని ధరణి వి, చెన్నై అనకాపుత్తూరు స్కూలు విద్యార్థిని మైథిలి పి, కడలూరు జిల్లా పన్రుట్టి ప్రభుత్వ మోడల్ స్కూలు విద్యార్థి మురళీధరన్ కే, తిరువణ్ణామలై ప్రభుత్వ మోడల్ స్కూలు విద్యార్థి వెట్రివేల్ ఎస్, విద్యార్థిని పచ్చయమ్మాళ్, కడలూరు ముట్టమ్ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూలు విద్యార్థిని అక్షయ ఎస్, చెంగల్పట్టు మేడవాక్కం ప్రభుత్వ స్కూలు విద్యార్థి నితీష్ కే, సేలం ప్రభుత్వ మోడల్ స్కూలు విద్యార్థి రోహిత్ జి, నామక్కల్ పచ్చాల్ ప్రభుత్వ స్కూలు విద్యార్థిని హారిని జి, తిరువణ్ణామలై ప్రభుత్వ మోడల్ స్కూలు విద్యార్థి ప్రవీణ్ ఎస్ 200ల నుండి 199 కటాఫ్ మార్కులతో తొలి పది ర్యాంకులు సంపాదించుకున్నట్లు మంత్రి వివరించారు. విలేఖరుల సమావేశంలో ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి పి. శంకర్, సాంకేతిక విద్యామండలి కమిషనర్ జే ఇన్నోసెంట్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే పాలనతోనే అభివృద్ధి సాధ్యం

● సీఎం స్టాలిన్

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మరే రాష్ట్రంలో లేనివిధంగా అనేక పథకాలను విజయవంతంగా అమలు చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో శుక్రవారం ఉదయం కలైంజర్ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించిన సదస్సులో సీఎం మాట్లాడారు. సాహిత్య అకాడమీ పురస్కారం అందుకునే సాహితీవేత్తలకు దివంగత మాజీ సీఎం కరుణానిధి జయంతి సందర్భంగా ఇళ్లు, లేగదూడలు అందజేసినట్లు తెలిపారు. ఈ పథకంలో ఇప్పటివరకు 15 మంది సాహితీవేత్తలు లబ్ధిపొందారని వీరికి పంపిణీ చేసిన ఒక్కో ఇంటి విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుందన్నారు. అదేవిధంగా 10 మంది అనువాద సాహితీవేత్తలకు కూడా రూ.లక్షతో పాటు ఉచితంగా ఇళ్లు కేటాయించామని సీఎం తెలిపారు. సాహితీవేత్తలు వారు జీవించే రోజుల్లోనే సమాజంలో గౌరవంగా ఉండాలన్న దృష్టితో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కరుణానిధి వ్యవహరించిన సమయంలో 108 మంది తమిళ సాహితీవేత్తల పుస్తకాలను జాతికి అంకితం చేసి వాటి నిర్వహణ కోసం రూ.7.76 కోట్లు అందజేశారని సీఎం అన్నారు. ఈ నాలుగేళ్ళ డీఎంకే పాలనలో 36 మంది తమిళ సాహితీవేత్తల పుస్తకాలను జాతికి అంకితం చేసి, కాపీరైట్ నగదుగా రూ.4.25 కోట్లు అందజేసినట్లు సీఎం స్టాలిన్ సభాముఖంగా పేర్కొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న సీఎం స్టాలిన్

అదనపు భవనాల ప్రారంభం...

స్థానిక కీల్పాక్‌లో హిందూ దేవాదాయశాఖ నిర్వహణలో ఉన్న ఏకాంబరనాథర్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో రూ.11.15 కోట్లతో మూడంతస్తులతో నిర్మించిన కొత్త భవనాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల మూడంతస్తుల భవనంలో ఏర్పాటు చేసిన తరగతి గదులు, ల్యాబ్, లైబ్రెరీ, టీచర్ల విశ్రాంతి గదులను సీఎం పరిశీలించారు. అదేవిధంగా ఈ పాఠశాల చూలైమేడులో నిర్వహిస్తున్న అన్నుగం ప్రాథమిక పాఠశాల కోసం రూ.7.79 కోట్లతో నిర్మించిన డైనింగ్ హాలు, మరుగుదొడ్లు, క్రీడా మైదానం, పునరుద్ధరించిన పాఠశాల భవనాలను సీఎం ప్రారంభించారు. ఈ పాఠశాలలో 10వ తరగతి, ప్లస్‌వన్, ప్లస్‌టూ చదువుతున్న 250 మంది విద్యార్థులకు, అన్నుగం ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న 1,101 విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థులు 166 మందికి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, సమాచారశాఖ మంత్రి స్వామినాథన్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాందాస్‌తో టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుంతగై భేటీ

● డీఎంకే తరపున రాయభారమా?

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌తో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ఆకస్మికంగా భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పీఎంకేను డీఎంకే కూటమిలోకి రమ్మని ఆహ్వానించడానికే భేటీ అయ్యింటుందని తైలాపురం గార్డెన్ వర్గీయులంతా కోడై కూస్తున్నారు. ఆరు నెలలుగా పార్టీ అధ్యక్షుడు అన్బుమణి, పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్‌కు మధ్య విబేధాలు వెలుగు చూస్తున్నాయి. పార్టీలో సంక్షోభానికి డీఎంకే కారణమని అన్బుమణి ఆరోపించినప్పుడు, రాందాస్ వెంటనే ఖండిస్తున్నారు. పార్టీలో తలెత్తిన సమస్యలకు డీఎంకేకు సంబంధం లేదంటూ సుదీర్ఘ ప్రకటనను పత్రికలకు విడుదల చేస్తుంటారు. అదే సమయంలో రాందాస్, ఆయన తనయుడు అన్బుమణి మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రముఖ ఆడిటర్ గురుమూర్తి ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. ఈ క్రమంలో రాందాస్‌తో శుక్రవారం ఉదయం సెల్వపెరుంతగై భేటీ అయ్యారు. ఆ సందర్భంగా ఇద్దరు పాత అనుబంధాలను చర్చించినట్టు సమాచారం. ఈ విషయమై సెల్వపెరుంతగై మాట్లాడుతుతూ... రాందాస్‌ను మర్యాదపూర్వకంగానే కలుసుకున్నానని, నాలుగు దశాబ్దాలుగా తమ మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. తమ ఇరువురి మధ్య అసెంబ్లీ ఎన్నికల ప్రస్తావన రాలేదన్నారు. రాందాస్ అస్వస్థతకు గురైనట్టు తెలియడంతో పరామర్శించేందుకు వచ్చానన్నారు. గురువారం రాత్రి కాట్టుమన్నార్‌కోవిల్‌లో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నానని, అక్కడి నుంచి చెన్నైకి వెళ్తూ మార్గమధ్యంలో దిండివనం వద్దనున్న రాందాస్‌ను కలుసుకోవాలని భావించి, తైలాపురం గార్డెన్‌లో అడుగుపెట్టానని చెప్పారు. పీఎంకే డీఎంకే కూటమిలో చేరే అవకాశం ఉందా అని మీడియా ప్రశ్నించినప్పుడు ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకే అధిష్ఠానమేనని బదులిచ్చారు. పీఎంకేలో సంక్షోభానికి డీఎంకే కారణమంటూ అన్బుమణి రాందాస్ ఆరోపించడం ఆయన అమాయకత్వాన్ని రుజువు చేస్తోందని సెల్వపెరుంతగై అన్నారు. పీఎంకేలో సమస్యలు సృష్టించాల్సిన అవసరం డీఎంకేకు లేదన్నారు. తనకు తెలిసినంతవరకూ పీఎంకేలో సమస్యలు తలెత్తడానికి బీజేపీ కారణమని ఆరోపించారు. బీజేపీ ఏ పార్టీలతో పొత్తుపెట్టుకుంటుందో ఆ పార్టీలన్నీ పత్తాలేకుండా పోతాయని, పదేళ్లుగా వివిధ రాష్ట్రాలలో ప్రజాబలం కలిగిన పలు పార్టీలను బీజేపీ స్వాహా చేసిందని సెల్వపెరుంతగై అన్నారు.



తైలాపురం గార్డెన్‌లో రాందాస్‌తో భేటీ అయిన సెల్వపెరుంతగై

త్వరలో ఉస్మాన్ రోడ్డు - సీఐటీ నగర్ ఫ్లైఓవర్ ప్రారంభం

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో వాణిజ్యానికి కేంద్రమైన టి.నగర్‌లో వాహనాల రద్దీ నియంత్రణ దిశగా ఉస్మాన్‌రోడ్డు - సీఐటీ నగర్‌ను కలుపుతూ రూ.164.92 కోట్లతో 90శాతం నిర్మాణం పనులు పూర్తైన ఫ్లైఓవర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)అధికారులు తెలిపారు. నాలుగేళ్లలో రద్దీ అధికంగా ఉన్న పలు ప్రాంతాల్లో జీసీసీ ఫ్లైఓవర్ల నిర్మాణం పనులు చేపట్టింది. ఇందులో కోడంబాక్కం కార్పొరేషన్ జోన్ పరిధిలోని 133-141 వార్డులను కలుపుతూ సౌత్ ఉస్మాన్ రోడ్డు - సీఐటీ నగర్ ప్రధాన రహదారిలో ఫ్లైఓవర్ నిర్మితమవుతోంది. సౌత్ ఉస్మాన్‌రోడ్డు, బర్కిట్‌రోడ్డు, మ్యాడ్లీరోడ్డు, సౌత్ వెస్ట్ బోగ్ రోడ్డు, న్యూ బోగ్ రోడ్డు జంక్షన్లలో వాహనాల రద్దీని నివారించే విధంగా ఈ ఫ్లైఓవర్‌ను జీసీసీ ప్రజా పనులశాఖ ఇంజనీర్లు డిజైన్ చేశారు. మొత్తం 1.2 కిలోమీటర్ల పొడవు8.40 మీటర్ల వెడల్పుతో రెండు వరుసల్లో నిర్మాణంలో ఉంది. సీఐటీ నగర్ ప్రధాన మార్గంలో 140 మీటర్లు, ఉస్మాన్ రోడ్డులో వంతెన పైకెక్కేందుకు 120 మీటర్లు, దిగేందుకు 100 మీటర్లతో రెండుదారులు ఏర్పాటవుతున్నాయి. రెండువైపులా నాలుగు కిలోమీటర్ల లింక్‌రోడ్లు, 1.5 మీటర్ల ఫుట్‌పాతులతో 53 సిమెంటు స్తంభాలపై నిర్మితమవుతున్న ఈ ఫ్లైఓవర్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. ఇది ఇందుబాటులోకి వస్తే ప్రతి రోజు సుమారు 40వేలకు పైగా వాహనాలు వంతెనపై రాకపోకలు సాగించే అవకాశముంది.



నిర్మాణ దశలో ఉస్మాన్‌రోడ్డు-సీఐటీనగర్ ఫ్లైఓవర్

● బాలుడి కిడ్నాప్ వ్యవహారం

పూవై జగన్‌మూర్తి బెయిలు పిటిషన్ తోసివేత

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కలాంబాక్కం వద్ద బాలుడి కిడ్నాప్ ఉదంతంలో నిందితుడిగా ఉన్న పురట్చి భారతం నాయకుడు, కేవీ కుప్పం ఎమ్మెల్యే పూవై జగన్‌మూర్తి బెయిలు పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. కలాంబాక్కానికి చెందిన యువకుడు ధనుష్ తేని జిల్లాకు చెందిన విజయశ్రీని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ వివాహాన్ని అంగీకరించని విజయశ్రీ తల్లిదండ్రులు కిరాయిముఠాను రంగంలోకి దింపారు. ధనుష్, విజయశ్రీని కిడ్నాప్ చేయాలని కోరారు. కిరాయి ముఠా విజయశ్రీ ఇంటికి వెళ్లినప్పుడు ఆమె తమ్ముడైన 17 యేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసుకెళ్ళి విడిచిపెట్టారు. ఈ వ్యవహారంలో పూవై జగన్‌మూర్తి, ఏడీజీపీ జయరాంకు సంబంధాలున్నట్లు తెలియటంతో హైకోర్టు విచారణ జరిపి ఏడీజీపీ జయరాం అరెస్టుకు ఆదేశాలిచ్చింది. పూవై జగన్‌మూర్తిని తీవ్రంగా మందలించింది. ప్రస్తుతం బాలుడి కిడ్నాప్ కేసు దర్యాప్తు తీవ్రం కావడంతో పోలీసులు తనను అరెస్టు చేస్తారని జగన్‌మూర్తి హైకోర్టులో బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఉదయం న్యాయమూర్తి జస్టిస్ జి. జయచంద్రన్ ఎదుట ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. పోలీసుశాఖ తరఫు న్యాయవాది రవీంద్రన్ హాజరై కేసు విచారణకు సంబంధించిన నివేదికను సమర్పించారు. జగన్‌మూర్తి తరఫున హాజరైన న్యాయవాది ఎస్. ప్రభాకరన్ బాలుడి కిడ్నాప్ ఉదంతంతో జగన్‌మూర్తి ఎలాంటి సంబంధం లేదని వాదించారు. జగన్‌మూర్తి పోలీసుల విచారణ సమయంలో తికమకగా సమాధానాలు చెప్పారని, ఆయనకు బెయిలిస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని పోలీసుశాఖ తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదప్రతివాదనల అనంతరం న్యాయమూర్తి బెయిలు పిటిషన్‌ను తోసిపుచ్చారు.



పూవై జగన్‌మూర్తి



మినీ టైడల్ పార్క్ నమూనా చిత్రం

రాశిపురంలో మినీ టైడల్ పార్కు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా రాశిపురంలో మినీ టైడల్ పార్కు నిర్మాణానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రూ.34.75 కోట్లతో టైడల్ పార్కును నిర్మించనుంది. ఈ టైడల్ పార్కు ద్వారా 600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. టైడల్ పార్కులో 500 మంది దాకా సమాచార సాంకేతిక నిపుణులు పనిచేయడానికి అనువుగా ఏసీ సదుపాయాలు, త్రీఫేస్ విద్యుత్‌సరఫరా, విద్యుత్ స్తంభాలతో కూడిన రహదారులను నిర్మించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కుట్రాలం జలపాతాల్లో పర్యాటకులకు అనుమతి



కుట్రాలం జలపాతం వద్ద స్నానం చేయడానికి వెళుతున్న పర్యాటకులు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా పడమటి కనుమల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కుట్రాలం జలపాతాల్లో శుక్రవారం ఉదయం నుంచి పర్యాటకులను అనుమతించారు. దీంతో ప్రధాన జలపాతం, ఐందరువి తదితర జలపాతాల వద్ద పర్యాటకులు వేకువజామునే అధిక సంఖ్యలో బారులు తీరారు. మూడు రోజుల విరామం తర్వాత పర్యాటకులు జలపాతాలకు తరలి వెళ్లారు. ఉదయం 9 గంటల నుంచి సిత్రరువి, పులియరువి జలపాతాల వద్ద కూడా పర్యాటకులు స్నానం చేయడానికి అనుమతించారు.

మార్కెట్లోకి ఈ-డాడీ ఎలక్ట్రిక్ ఆటో



లోగో ఆవిష్కరిస్తున్న శివరాజరామయ్య, కె.మోహన్, యాస్మిన్ జవహర్ అలీ, సిరాజుద్దీన్

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) అనుమతితో ఈ-డాడీ సంస్థ ఎలక్ట్రిక్ ఆటోను మార్కెట్లో పరిచయం చేసింది. నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈవీ ఇండియా ఎక్స్‌పోర్టు-2025 ప్రదర్శనలో ఈ-డాడీ ఇండియా పాలుపంచుకుంది. ఈ సందర్భంగా వాయు కాలుష్యం వల్ల పర్యావరణం దెబ్బతినకుండా విద్యుత్‌తో నడిపే ఎక్స్-3 ఆటోను అధికారికంగా మార్కెట్‌కు పరిచయం చేసింది. ఇందులో తమిళనాడు స్టార్టప్ సంస్థ మిషన్ డైరెక్టర్ శివరాజరామయ్య, ఇప్పోపే సంస్థ ఫౌండర్ కె.మోహన్, ఈ-డాడీ ఫౌండర్ యాస్మిన్ జవహర్ అలీ, ఆ సంస్థ సీటీవో సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ, ఇంతకు ముందు పలు రకాల సంస్థలు ఎలక్ట్రిక్ ఆటోలను మార్కెట్‌లోని లాంచ్ చేశాయని, కానీ తమ ఈ-డాడీ సంస్థ వాటన్నింటికన్నా అధునాతన టెక్నాలజీతో ఈ ఆటోలను రూపొందించినట్టు తెలిపారు.

మేట్టూరు డ్యాంలో ఫ్లడ్ కంట్రోల్ రూం

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంలో నీటిమట్టం పెరిగి వరద ఉధృతిని నియంత్రించేందుకు జల వనరుల శాఖ 48 మంది పర్యవేక్షించే కంట్రోల్ రూంను ప్రారంభించింది. డెల్టా జిల్లాలలోని వ్యవసాయ భూములకు సాగునీరు, ప్రజలకు తాగునీటి అవసరాలను తీరుస్తున్న మేట్టూరు డ్యాం నీటిమట్టం శుక్రవారం ఉదయం 8 గంటలకు 114 అడుగులకు పెరిగిన నేపథ్యంలో, డ్యాంలోకి నీరు ఉధృతంగా చేరుతుండటంతో పూర్తి సామర్థ్యానికి చేరుకునే అవకాశముందని నిర్వహణ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని కబిని, కేఆర్ఎస్ డ్యాంలనుంచి నీటిని దిగువలకు విడుదల చేస్తున్నారు. దీంతో కావేరి ప్రధాన కాలువలో గత రెండు వారాలుగా నీరు మేట్టూరు జలాశయంలోకి చేరుతుండడంతో నీటి మట్టం పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 8 గంటలకు డ్యాం నీటిమట్టం 114 అడుగులకు పెరిగింది. అదేవిధంగా డ్యాంలో 84.22 టీఎంసీల నీరు నిల్వవుంది. డ్యాం నుండి డెల్టా సాగుకు సెకనుకు 22,500 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మేట్టూరు డ్యాం నీటి పూర్తి సామర్థ్యం 120 అడుగులు కాగా, పలు ప్రాంతాలనుంచి వస్తున్న నీటి రాకతో డ్యాం పూర్తిస్థాయికి చేరుకున్న పక్షంలో మిగులు జలాలను విడుదల చేసేందుకు, ప్రవాహం ఉధృత రూపం దాల్చితే తీసుకోవాల్సిన చర్యల కోసం జల వనరుల శాఖ ఆధ్వర్యంలో డ్యాం ఎడమవైపు గట్టులో ఫ్లడ్ కంట్రోల్ రూంపర్పాటైంది. ఇందులో 8 మంది ఇంజనీర్లు సహా 48 మంది షిఫ్ట్ పద్ధతిలో 24 గంటలు డ్యాంను పర్యవేక్షిస్తారు. డ్యాం భద్రతను దృష్టిలో ఉంచుకుని 16 గేట్లనుంచిజలాలను విడుదల చేసేలా చర్యలు చేపడతారు.



ఇంతటి ప్రజాదరణ లభించడం అదృష్టం తరుణి

- నెటిజన్ల ప్రశంసలతో జన్మసార్థకం
- హిజ్రా బ్యూటీ అనుశ్రీ







కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరు పేట సమీపంలో కూవాగం కూత్తాండవర్ ఆలయంలో యేటా చిత్తిరై ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు దేశవిదేశాల నుంచి హిజ్రాలు తరలివస్తారు. ఈ యేడాది కూత్తాండవర్ చిత్తిరై వేడుకల్లో పాల్గొన్న హిజ్రా అనుశ్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె అందానికి సోషల్‌మీడియాలో నెటిజన్లు జోహార్లు పలికారు. ప్రస్తుతం మోడలింగ్, షార్ట్ ఫిలింలలో నటిస్తూ బిజీగా ఉంది. ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఆమె పడిన కష్టనష్టాలు అన్నీఇన్నీ కావు. అందాల భామ అనుశ్రీ సంక్షిప్త జీవన ప్రస్థానమే ఇది.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

బాధపెట్టిన బరువు...

వేళకు సరైన తిండి లేకపోవటం, దొరికిన ఆహారం తినటం, అవయవాల మార్పిడి చికిత్సలు చేసుకోవడం వంటి కారణాల వల్ల లావెక్కా. నా బరువు 107 కేజీలకు పెరిగింది. నా ఫ్రెండ్ వెయిట్ లాస్‌కు సర్జరీ ఉందని చెప్పింది. అమ్మాయిలా ఉండాలి. అదే సమయంలో అందంగా ఉండాలంటే అందుకు తగ్గ నాజూకైన దేహంతో అగుపించాలని నిర్ణయం తీసుకుని బరువు తగ్గేందుకు ఆపరేషన్ చేసుకున్నా.

పదేళ్లలో హార్మోన్ల మార్పు...

అనుశ్రీ స్వస్థలం కోయంబత్తూరు. మగబిడ్డగా జన్మించి, పదేళ్ల వయస్సులో హార్మోన్లలో వచ్చిన మార్పుల వల్ల ఆడతనపు ఆనవాళ్లు అధికమైంది. ఇంట్లోని వారికి చెప్పడానికి భయమేసేది. స్కూలు వెళ్లి తిరిగివస్తూ హిజ్రాలను చూస్తుంటే ఏదో అనుభూతికి లోనయ్యేది. వాళ్లలాగే తనూ తలలో పూలు పెట్టుకోవాలనే కోరిక కలిగేది. చీరకట్టుకోవాలని ఆశ పుట్టేది. మనసులోని మాటను ఆ హిజ్రాలకు తెలిపింది. కొద్ది రోజులు గడవనీ, వెంటనే నిర్ణయం తీసుకోవద్దని ఆ హిజ్రాల మాటకు కట్టుబడింది. రోజూ స్కూలుకు వెళ్లి తిరిగి వస్తూ హిజ్రాలతో ఎక్కువ సమయాన్ని గడుపుతుండేది. ఇంట్లో 'అతడి'లో వచ్చిన ఆడతనపు చేష్టలు గమనించి కుటుంబ సభ్యులంతా చితకబాదారు. ఆ దెబ్బలు తాళలేకుండా ఇంటి నుంచి పారిపోయింది. ముంబైలో హిజ్రాలు ఎక్కువగా ఉంటారని తెలుసుకుంది. టికెట్టు లేకుండానే ముంబైకి చేరుకుంది. రైలులో తానొక హిజ్రా అని చెప్పగానే టీటీ టికెట్టు అడగలేదు.

ఒంటరిగానే... : '17 యేళ్ల వయస్సులో ముంబైలో ఒంటరిగానే గడపా. చేతిలో చిల్లిగవ్వలేదు. హిజ్రాలు ఎక్కడుంటారో కూడా తెలియదు. ఓ ఆటోలో ఎక్కా. హిజ్రాలు ఎక్కువగా ఉండే ప్రాంతానికి వెళ్ళమన్నా. ఆ ఆటో డ్రైవర్‌కు వెండి మొలతాడు ఇస్తానన్నా. ఈలోగా ఓ హిజ్రా వందరూపాయలిచ్చి ఆదుకుంది. హిజ్రాల గుంపులో చేర్చింది. రోజూ భిక్షమెత్తేదాన్ని. పెళ్లిళ్లు, బర్త్‌డేలకు వెళ్లి డ్యాన్స్ చేసి సంపాదించేదాన్ని. అలా సంపాదించిన సొమ్ముతో వక్షోజ చికిత్స చేసుకుని అమ్మాయిగా మారా. 24 యేళ్ల వయస్సులో చెన్నైకి చేరా. ఆరంభంలో కుటుంబసభ్యులు ఇంట్లో అడుగుపెట్టనివ్వలేదు. ఆ తర్వాత అమ్మకు, చెల్లికి యాక్సిడెంట్ అయ్యింది. చూడటానికి వెళ్లినప్పుడు సంతోషపడ్డారు. ఇంట్లోకి రానిచ్చారు. ఇప్పుడు ఇంటికి వెళ్లడం కుదరటం లేదు. రెండు మూడు నెలలకోసారి వెళ్తుంటా' అంటూ అనుశ్రీ చెప్పుకొచ్చింది.

ప్రేమ మెరుపు...

అనుశ్రీ జీవితంలోనూ ప్రేమ తొంగి చూసింది. ఓ అందమైన యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇక జీవితాంతం అతడే తనకు తోడుగా ఉంటాడని కలలు కనేది. చివరకు 'నీ వల్ల సంతానం కలగదు. మన పెళ్లికి మా ఇంట్లోవాళ్లు ఒప్పుకోరు' అంటూ వదిలేశాడు. 'ఓ అమ్మాయికి బిడ్డ పుట్టకపోతే ఏ మగాడైనా ఇలా అర్ధాంతరంగా విడిచిపెట్టి వెళ్తే వాడా? ఆమెతో కాపురం చేసేవాడు కదా' అంటూ అనుశ్రీ వాపోయింది. హిజ్రాలంతా ప్రకృతి ప్రసాదించిన పరిస్థితులను అర్థం చేసుకునే జీవితభాగస్వామి కోసం తాపత్రయపడుతున్నారని, అయితే ఎవరికీ అలాంటి జీవితం ప్రాప్తించడం లేదనింది.

పెరిగిన ప్రజాదరణ...

ఇక సోషల్ మీడియాలో అనుశ్రీ వైరల్ అవుతుండటం గురించి ప్రస్తావించినప్పుడు... 'చెన్నైలో మోడలింగ్ చేస్తూ, షార్ట్ ఫిలింలలో నటిస్తూ బిజీగా మారా. ఈ యేడాదే మొదటిసారిగా కూత్తాండవర్ చిత్తిరై ఉత్సవాలకు వెళ్లా. అందరూ నన్ను చూసి అసలుసిసలు అమ్మాయిలా ఉన్నావే అంటూ మెచ్చుకున్నారు. ఆ వేడుకల్లో పాల్గొన్న వారెవరో నా అందాలను చూసి వీడియో తీసి సోషల్ మీడియాలో వెలువరించారు. ఆ వీడియోలో లక్షల సంఖ్యలో నెటిజన్లు నా గురించి పాజిటివ్‌గా కామెంట్లు చేశారు. మగవాడిగా జన్మించి హిజ్రాగా మారిన నన్ను ఇలా ప్రపంచ వ్యాప్తంగా అమ్మాయిగానే భావిస్తూ కామెంట్లు చేయడంతో నా జన్మసార్థకమైందనే ఫీలింగ్ కలుగుతోందని చెబుతున్నప్పుడు అనుశ్రీ కళ్లలో సంతోషం కొట్టొచ్చినట్లు కనిపించింది. 'ఈ ఆదరణ కోసమే ఇన్ని కష్టాలు. హార్మోన్ల మార్పుల వల్ల చదువు పోగొట్టుకున్నా. భవిష్యత్‌ను దారపోసుకున్నా. ఎన్నో అవమానాలు పడ్డా. అయితే ఇప్పుడా బాధలన్నీ మరచిపోయా. సమస్త ప్రజానీకం ఆదరాభిమానాలు లభించడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ప్రేమాభిమానాల కోసం తపించిన నాకు ఇంతటి ప్రజాభిమానం లభిస్తుందని కలలో కూడా ఊహించలేదు' అంటూ అనుశ్రీ ఉప్పొంగిపోయింది.

ఒకరికి విషం మరొకరికి అమృతం

- శరత్ కుమార్



'3బీహెచ్‌కే' ఆడియో రిలీజ్ దృశ్యం

మనకు నచ్చనిది మరొకరికి నచ్చుతుంది, ఒకరికి విషంలా కనిపించేది మరొకరికి అమృతంలా ఉంటుందని హీరో శరత్‌కుమార్ అన్నారు. శ్రీగణేష్ దర్శకత్వంలో అమృత్ రాంనాథ్ సంగీతంలో సిద్ధార్థ్, శరత్ కుమార్, దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర తదితరులు నటించిన తాజా చిత్రం '3బీహెచ్‌కే'. శాంతి టాకీస్ బ్యానరుపై నిర్మితమైంది. ఈ సినిమా ట్రైలర్, ఆడియో రిలీజ్ వేడుక గురువారం నగరంలో జరిగింది. ఇందులో తమిళ చిత్రపరిశ్రమలో సూపర్‌హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన యువ దర్శకులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. వీరంతా బుల్లితెరపై ప్రసారమయ్యే 'నాళైయ ఇయ్యక్కునర్‌గళ్'లో పాల్గొన్నవారు కావడం గమనార్హం. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి పోటీతత్వం, ద్వేష భావం లేకుండా స్నేహభావంతో మెలుగుతూ తమ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఈ వేడుకలో పాల్గొన్నవారిలో అభిషన్ జీవింత్, నితిలన్ స్వామినాథన్, అశ్వత్ మారిముత్తు, రవికుమార్, మాడోన్ యంగ్ డైరెక్టర్స్ అశ్విన్, గణేష్‌బాబు, తమిళరసన్ పచ్చముత్తు, రామ్‌కుమార్ బాలకృష్ణన్, వినోద్ రాజ్, ముత్తుకుమార్, అరవింద్, శక్తివేల్‌తో పాటు సీనియర్ దర్శకులు మారి సెల్వరాజ్, రామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో ఒక ప్రధాన పాత్రను పోషించిన శరత్ కుమార్ మాట్లాడుతూ... కళారంగం కూడా కొన్నేళ్ల పాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలి' దాన్ని అర్థం చేసుకుని చిత్రాలను విశ్లేషించాలి' అని పేర్కొన్నారు. అతిథిగా పాల్గొన్న హీరో రవి మోహన్ మాట్లాడుతూ... 'సాధారణంగా ఒక హీరో చిత్రాన్ని మరొక హీరో చూసేందుకు ఇష్టపడరు. నేను సిద్ధార్థ్ స్నేహితులం. తెలుగు 'బొమ్మరిల్లు' చిత్రం తమిళ రీమేక్‌లో నేను నటించా. మంచి కథలను ఎంచుకుని ముందుకు సాగుతున్నాడు. అమృత్ రాంనాథ్ సంగీతం చాలాబాగుంది. ఈ సినిమా సొంత ఇంటి కలపై సాగుతుంది. నేను అద్దె ఇంట్లో ఉన్నది లేదు. చిన్న వయస్సు నుంచే సొంతింట్లో ఉన్నా. కానీ, ఇపుడు అద్దె ఇంట్లో ఉంటున్నా' అని పేర్కొన్నారు. హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ... 'ఇది నాకు 40వ చిత్రం. ఈ విషయాన్ని డాడీకి చెప్పగా, ఆయన ఒక ప్రశ్న వేశారు. దానికి నేను సమాధానం చెప్పలేదు. అయితే, ఆ ప్రశ్నలో ఒక ఓర్పు, ఆశ్చర్యం ఉంది. నా తండ్రి కళ్లలో ఒక రిలీఫ్ కనిపించింది. 40 చిత్రాలను పూర్తి చేసే భాగ్యం కల్పించింది నా తల్లి, తండ్రి. ఇక్కడ తల్లి అంటే రచయిత, తండి అంటే నిర్మాత. శ్రీగణేష్, అరుణ్ విశ్వ నన్ను నమ్మి ఈ సినిమాను నిర్మించారు' అంటూ ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు.

చిత్రజ్యోతి

కార్తి - సూర్య



ద్విభాషా చిత్రాలపై కోలీవుడ్ హీరోల మొగ్గు?

కోలీవుడ్ హీరోలు ద్విభాషా చిత్రాలపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా తెలుగు, తమిళ చిత్రాల్లో నటించేందుకు అమితాసక్తిని చూపుతున్నారు. తాము నటించే చిత్రాలను కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కూడా విడుదల చేస్తున్నారు. ఈ కోవలో ధనుష్, సూర్య, కార్తి వంటివారు ముందు వరుసలో ఉన్నారు. అయితే, ఇలా రూపొందించే చిత్రాలు తమిళ ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాయనే టాక్ ఉంది. ఎందుకంటే. ఈ చిత్రాలకు దర్శకత్వం వహించేది తెలుగు దర్శకులు, నిర్మించేది కూడా తెలుగు నిర్మాణ సంస్థలే. దీంతో ఈ సినిమాల్లో తెలుగు నేటివిటీ స్పష్టంగా కనిపిస్తోందని కోలీవుడ్ సినీ ప్రముఖుల టాక్. ఈ సినిమాలు తెలుగు స్టైల్‌లోనే ఉంటున్నాయి. ఫలితంగా కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద బోల్తాపడుతున్నాయి. తాజాగా ధనుష్ నటించిన 'కుబేర' చిత్రం కూడా తమిళంలో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. వాణిజ్యపరంగా కూడా నిరాశపరిచింది. తెలుగులో సూపర్ హిట్ అయింది. అలాగే, సూర్య తన తదుపరి చిత్రాన్ని వెంకీ అట్లూరి దర్శకత్వంలో నటిస్తున్నారు. 'హిట్-4'లో కార్తి కథానాయకుడుగా నటిస్తున్నారు. మరి ఈ రెండు చిత్రాలు ప్రేక్షకులను ఏ విధంగా ఆలరిస్తాయో వేచి చూడాల్సిందే.


'మానాడు-2' కాంబినేషన్ రిపీట్!



శింబు - వెంకట్ ప్రభు

హీరో శింబు, వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో వచ్చిన 'మానాడు'కి రెండో భాగం తెరకెక్కనుంది. ఇందుకోసం కలిసి పని చేయాలని దర్శకహీరోలు నిర్ణయించారు. సుదీర్ఘకాలంగా విజయం కోసం పరితపిస్తున్న శింబుకు 'మానాడు'తో వెంకట్ ప్రభు మంచి విజయాన్ని అందించారు. ఈ చిత్రంలోని టైమ్ లూప్ సన్నివేశాలు, హాస్యం, స్క్రీన్‌ప్లే, ఎస్‌జే సూర్య నటన ఇలా అన్ని అంశాలను ప్రేక్షకులు అమితంగా ఎంజాయ్ చేశారు. ఈ క్రమంలో ఈ మూవీ రెండో భాగాన్ని తెరకెక్కించాలని శింబు - వెంకట్ ప్రభులు నిర్ణయించారు. అయితే, ప్రస్తుతం వీరిద్దరూ వేర్వేరు ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలు పూర్తి చేసి 'మానాడు-2'లో నటించాలన్న నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. తొలిభాగం నిర్మించిన నిర్మాత సురేష్ కామాక్షి సీక్వెల్‌ను నిర్మించనున్నారు.

వెటరన్ నటుడు జి.శ్రీనివాసన్ మృతి



జి.శ్రీనివాసన్ (ఫైల్ ఫొటో)

తమిళ చిత్రపరిశ్రమలో 1970, 1980 దశకంలో సహాయ నటుడిగా, ప్రతినాయకుడి పాత్రల్లో నటించిన వెటరన్ నటుడు జి.శ్రీనివాసన్(95) మృతి చెందారు. ఈయన నృత్యదర్శకురాలు, దివంగత నటి పులియూర్ సరోజ భర్త. వృద్ధాప్యం కారణంగా గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వచ్చిన ఆయన... గురువారం వడపళనిలోని సూర్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని స్థానిక అశోక్‌నగర్, ఇందిరా కాలనీలోని స్వగృహంలో సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆ తర్వాత అంత్యక్రియలను శుక్రవారం సాలిగ్రామంలోని ఏవీఎం శ్మశానవాటికలో పూర్తి చేశారు. కాగా, నటుడిగా దాదాపు 200కు పైగా చిత్రాల్లో ఆయన నటించారు. తమిళం, తెలుగు, మలయాళం భాషా సినిమాల్లో నటించి పేరు గడించారు. ఒకటి రెండు చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. ఆయన నటించిన చిత్రాల్లో 'కిళక్కే పోగుమ్ రయిల్', 'కన్ని పరువత్తిలే', 'రాణువ వీరన్', 'ఇదయకోవిల్', 'అయ్యా', 'నగరం', 'వేంగై' ఉన్నాయి. శ్రీనివాసన్ మృతికి కోలీవుడ్ సినీ ప్రముఖులు తమ సంతాపాన్ని తెలిపారు.

కొడైకెనాల్‌లో అధికమైన ఏనుగుల సంచారం

- పర్యాటక ప్రాంతాల సందర్శనపై నిషేధం

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల గుంపు సంచరిస్తున్న కారణంగా ప్రముఖ వేసవి విడిది కొడైకెనాల్‌లో పర్యాటక ప్రాంతాల సందర్శనపై జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. దిండుగల్ జిల్లా కొడైకెనాల్ చుట్టు పక్కల దట్టమైన అడవులున్నాయి. అడవుల నుంచి వెలుపలికి వచ్చిన ఏనుగుల గుంపు పర్యాటకులు అధికంగా సందర్శించే బేరిజం చెరువులో మకాం వేశాయి. దీంతో పర్యాటకులు ఏనుగుల దాడికి గురికాకుండా తగు భద్రతా చర్యలు చేపట్టాల్సిందిగా జిల్లా యంత్రాంగం అటవీశాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అటవీశాఖ ఆధీనంలో ఉన్న గుణ గుహలు, మేయర్ స్థూపం, పైన్‌ట్రీస్ రోడ్డు, పిల్లర్ రాక్, బేరిజం చెరువు తదితర ప్రాంతాలను మూసివేశారు. ఈ ప్రాంతాలను పర్యాటకులు సందర్శించకుండా అటవీశాఖ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. కాగా, కొడైకెనాల్‌లోని బోట్‌హౌస్, కోకర్స్ వాక్, సెయింట్ మేరీ చర్చి, పంపార్ జలపాతం, గ్రీన్‌వ్యాలీ వ్యూ, కురింజి ఆండవర్ ఆలయం తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది.



బోట్‌హౌస్ వద్ద పర్యాటకుల సందడి

తిరుచెందూర్‌లో గణపతి పూజతో కుంభాభిషేకం వేడుకలు ప్రారంభం



వల్లభ వినాయకుడి సన్నిధిలో పూజలు

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో ప్రసిద్ధిగాంచిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకలు శుక్రవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో జూలై 7న మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం ఏర్పాట్లను సన్నద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ ఆలయ రెండో ప్రాకారంలో ఉన్న వల్లభ వినాయకుడి సన్నిధిలో శివాచార్యులు గణపతి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగ బ్రహ్మచారి పూజ, ధ్వజపూజ, పూర్ణాహుతి, మహా హారతి నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు అష్టదిక్కుల పూజలు, వాస్తుశాంతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, జూలై 1వ తేదీ నుంచి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 76 యాగ గుండాల్లో యాగశాల పూజలను ప్రారంభించనున్నట్లు ఆలయ జాయింట్ కమిషనర్ జ్ఞానశేఖరన్ తెలిపారు.

ప్రజల్ని ఏకం చేయడంలో ప్రేమకు అపారశక్తి

- సయ్యదనా ముఫద్దల్ సైఫుద్దీన్

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశ్వంలోని ప్రజలందరినీ ఏకం చేయడంలో ప్రేమకు అపారశక్తి వుందని, ప్రజలు ప్రేమ, దయా గుణాలతో జీవించాలని దావూదీ బోహ్రా సమాజ 53వ నేత సయ్యదనా ముఫద్దల్ సైఫుద్దీన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ఎంబీ వీధిలోని సైఫీ మసీదులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రేమ ప్రజల్ని దాతృత్వం, దయ గల చర్యల వైపు ప్రేరేపిస్తుందని వివరించారు. ఈ సమావేశానికి దేశం నలుమూలల నుంచి 43 వేలమందికి పైగా బోహ్రా సమాజ సభ్యులు తరలివచ్చారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఫద్దల్ సైఫుద్దీన్

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు పేర్కొంది.

తాంబరం: సేలయూర్ కర్పగం నగర్, రంగనాథన్ నగర్, దేవరాజ్ నగర్, కామాక్షి నగర్, బాలాజినగర్, భారత్ నగర్, ఎంజీఆర్ నగర్, శారద గార్డెన్, భారత మెడికల్ కాలేజ్, అగరం మెయిన్ రోడ్డు కొంత భాగం. **పల్లావరం:** ఎస్బీఐ కాలనీ, పురుషోత్తమన్ నగర్ కొంత భాగం, గజలక్ష్మి నగర్, గణపతి నగర్, ఎస్ఎస్వార్ రోడ్డు, కమల వీధి, ఎంజీఆర్ వీధి, పచ్చప్ప నగర్, కుమరన్ కుండ్రం ఏరియా.

పోరూర్: కుండ్రత్తూర్ టెంపుల్ వేవ్, కుమరన్ నగర్, పీకేవీ మహానగర్, ఆర్పీ ధర్మలింగం నగర్.

30న ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించనున్న సీఎం

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహజ వాయువు, ఎలక్ట్రిక్ బస్సులు నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు చెన్నైలో 120 ఎలక్ట్రిక్ బస్సు సేవలను ఈనెల 30వ తేది సీఎం స్టాలిన్ ప్రారంభించనున్నారు. మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఆధ్వర్యంలో 625 ఎలక్ట్రిక్ బస్సులను ఐదు డిపోల నుంచి ఒప్పందం మేరకు నడిపేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వ్యాసర్పాడి బస్సు డిపో నుంచి 120 ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు అవసరమైన మరమ్మతుల భవనం, నిర్వహణ కార్యాలయం, ఉద్యోగుల విశ్రాంతి గదులు, ఛార్జింగ్ పాయింట్లు, అగ్ని ప్రమాదాలు నిరోధించేలా ఉపకారణాల ఏర్పాటు తదితర పనులు చేపట్టారు. చెన్నైలో తొలివిడతగా 625 ఎలక్ట్రిక్ బస్సులు నడిపేలా వ్యాసర్పాడి, పెరుంబాక్కం, పూందమల్లి, పల్లవన్ ఇల్లం, తండయార్‌పేట తదితర డిపోలు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా, 120 ఎలక్ట్రిక్ బస్సు సేవలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈనెల 30వ తేది ప్రారంభించనున్నారు.

బదిలీ కోసం లక్ష మంది ఉపాధ్యాయుల దరఖాస్తు

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు లక్షమంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి 'ఎమిస్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు స్వీకరణ జరిగింది. అంతర్ జిల్లా, వేరే జిల్లాకు బదిలీ కోరుతూ లక్షమంది టీచర్లు దరఖాస్తు చేసుకోగా, తుది దశ జాబితా ఈనెల 30వ తేది విడుదల చేయనున్నారు. జూలై 1న రెవెన్యూ జిల్లాలోపు బదిలీలు, 2వ తేది జిల్లా నుంచి మరో జిల్లాకు, పీజీ, కంప్యూటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, వృత్తి విద్య ఉపాధ్యాయులకు జూలై 3న అంతర్ జిల్లా బదిలీ, 4 నుంచి 8వ తేది వరకు జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ కౌన్సెలింగ్ జరగనుంది. యేటా ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ సమయంలో, పీజీ ఉపాధ్యాయులకు మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పిస్తుంటారు. కానీ, ఈ ఏడాది పదోన్నతులు లేకుండా, ఇప్పటికే హెచ్ఎంలుగా పనిచేస్తున్న వారికి మాత్రమే బదిలీ చేయనున్నట్లు ప్రకటించారు. కాగా, ఈ విధానంతో ఖాళీగా ఉన్న 300 ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీకాకుండా పోతాయని, పదోన్నతులు లేకపోవడంతో సుమారు 2,000 మంది పీజీ ఉపాధ్యాయులకు ఇబ్బంది పడతారని, అందువల్ల పదోన్నతులు కల్పించాలని పీజీ టీచర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కులగణన అధికారి బాధ్యతల స్వీకరణ

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కుల ఆధారిత జనాభ గణన 2027 మార్చి నుంచి ప్రారంభించాలని కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఈ గణన చేపట్టేందుకు ఐఏఎస్ అధికారి సుందరేశ్‌బాబును నియమించారు. ఆయన గురువారం స్థానిక శాస్త్రిభవన్‌లో ఉన్న కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని కులాల సమగ్ర జనాభా గణన లెక్కిస్తామన్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత గణనకు సంబంధించిన సన్నాహాలు అధికారికంగా ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ గణనలో సుమారు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. తొలిసారిగా జనాభా గణన 'డిజిటల్' పద్ధతిలో నిర్వహిస్తున్నామని, జిల్లా కలెక్టర్లు వారి జిల్లాలకు జనాభా గణన అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

చెన్నై విమానాశ్రయంలో ఉచిత వైఫై

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాయశ్రంలో ఉచిత వైఫై వసతి అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో ఉచిత వైఫై సౌకర్యం ఉంది. కానీ, చెన్నై విమానాశ్రయంలో ఈ సేవలు టెండర్లలో జాప్యం కారణంగా ఆరు నెలలుగా అందుబాటులో లేకుండా ఉన్నాయి. ఈ క్రమంలో, గురువారం నుంచి విమానాశ్రయంలో ఉచిత వైఫై సేవలు అందుబాటులోకి వచ్చాయి. అంతర్జాతీయ ప్రయాణికులు పాస్‌పోర్ట్, బోర్డింగ్ పాస్ స్కాన్ చేసి ఓటీపీ పొంది, ఈ హైస్పీడ్ వైఫై వసతి పొందవచ్చని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

15 నుంచి ఎయిడెడ్ పాఠశాలల్లో అల్పాహారం పథకం ప్రారంభం

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అన్నిరకాల ఎయిడెడ్ పాఠశాలల్లో ఉదయం అల్పాహారం పథకం జూలై 15వ తేది నుంచి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'ముఖ్యమంత్రి ఉదయం అల్పాహారం' పథకం 2022 సెప్టెంబరు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోంది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.600.25 కోట్లు కేటాయించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోని ఎయిడెడ్ పాఠశాలలకు ఈ పథకాన్ని విస్తరించారు. ఈ నేపథ్యంలో, నగర ప్రాంతాల్లో ఉన్న ఎయిడెడ్ పాఠశాలల్లో కూడా ముఖ్యమంత్రి ఉదయం అల్పాహారం పథకం జూలై 15వ తేది నుంచి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు, రేపు చెన్నై - గుమ్మిడిపూండి సబర్బన్ రైళ్లు పాక్షిక రద్దు

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైలు మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతులు కారణంగా శని, ఆదివారాల్లో గుమ్మిడిపూండి వైపునకు వెళ్లే సబర్బన్ రైళ్ల సేవలు పాక్షికంగా రద్దు చేశారు. ఆ ప్రకారం, మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పనులు చేపట్టనుండడంతో గుమ్మిడిపూండి, సూళ్లూరుపేటకు వెళ్లే 21 సబర్బన్ రైళ్లు రద్దు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్ - పొన్నేరి, మీంజూరు, ఎన్నూర్ మధ్య 10 ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

పశువుల విక్రయాలకు ప్రత్యేక వెబ్‌సైట్

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెంచేలా పశువుల విక్రయాలకు వెబ్‌సైట్ రూపొందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సరైన సమయంలో, సరైన ధరకు పశువులు విక్రయించేందుకు ఈ వెబ్‌సైట్ ఉపయోగపడనుంది. అలాగే, వెబ్‌సైట్ ద్వారా మార్కెట్ ధర, విక్రయానికి వచ్చిన పశువుల సంఖ్య సహా ఇతర సమాచారం తెలుసుకోవచ్చు. మంచి ధరకు పశువులను విక్రయించి రైతులు ఆదాయం పొందే అవకాశముందని, వెబ్‌సైట్ రూపొందించే పనులను పశు సంవర్థక అభివృద్ధి సంస్థ చేపట్టిందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

పరందూరు వద్ద కొత్త రైల్వేస్టేషన్

● రైల్వే మంత్రి సోమణ్ణ హామీ


కాంచీపురం రైల్వేస్టేషన్‌లో పరిశీలించేందుకు వెళ్తున్న సోమణ్ణ తదితరులు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) రెండో విమానాశ్రయం నిర్మించనున్న పరందూరు వద్ద కొత్త రైల్వేస్టేషన్ నిర్మిస్తామని రైల్వే శాఖ సహాయమంత్రి సోమణ్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన కాంచీపురం రైల్వేస్టేషన్‌ను స్థానిక అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంచీపురం జిల్లా పరందూరులో విమానాశ్రయ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. అదే సమయంలో ఆ ప్రాంతం వద్ద కొత్త రైల్వేస్టేషన్ నిర్మించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోందన్నారు. కరోనా సంక్షోభం తర్వాత నిత్యావసర వస్తువులు, బస్, విమాన ఛార్జీలు పెరిగాయని, అయితే రైల్వే ఛార్జీలు పెరగలేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగనిరీతిలో రైలు ఛార్జీలు స్వల్పంగా పెంచనున్నామని ఆయన చెప్పారు. ఆ తర్వాత ఆయన కాంచీపురంలోని ఏకాంబరనాథస్వామి, కామాక్షి ఆలయాల్ని సందర్శించారు.

● అన్నాడీఎంకే పార్టీ అంతర్గత వ్యవహారం...

ఈసీకి హైకోర్టు నోటీసు

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అంతర్గత పార్టీ అంశంపై ఎప్పుడు ఉత్తర్వులు జారీ చేస్తారని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అన్నాడీఎంకే సర్వసభ్య మండలి తీర్మానాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై ఎన్నికల కమిషన్ దర్యాప్తును వ్యతిరేకిస్తూ ఎడప్పాడి పళనిస్వామి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కేసుల విచారణ పూర్తయ్యే వరకు రెండాకుల చిహ్నం కేటాయించరాదనే పిటిషన్‌కు వ్యతిరేకంగా పళనిస్వామి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు విచారించిన హైకోర్టు, ఎన్నికల చిహ్నం కేటాయింపుల ఉత్తర్వుల ప్రకారం, అంతర్గత పార్టీ అంశాన్ని దర్యాప్తు చేసే అధికారం ఉందా? లేదా? అనే విషయమై ప్రాథమిక విచారణ నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, ప్రాథమిక దర్యాప్తుకు కాలపరిమితి కోరుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి కొత్త పిటిషన్ దాఖలుచేశారు.ఆ పిటిషన్‌లో... హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసి 7 వారాలైనా, కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, 2026 అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించకపోవడం వల్ల తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోందని, కావున, ఎన్నికల సంఘం ప్రాథమిక దర్యాప్తు ఆలస్యంగా చేయరాదంటూ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తులు ఆర్.సుబ్రమణియన్, కె.సురేందర్‌లతో కూడిన ధర్మాసనం విచారించగా, ఈపీఎస్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది విజయ్ నారాయణన్, ఎన్నికలు సమీపిస్తున్నందున త్వరగా ఉత్తర్వులు జారీచేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. అనంతరం ధర్మాసనం... ఉత్తర్వులు ఎప్పుడు జారీ చేస్తారో తెలియజేయాలని ఎన్నికల సంఘానికి నోటీసు జారీచేసి, తదుపరి విచారణ జూలై 4వ తేదీకి వాయిదావేశారు.

ముస్తాబవుతున్న నెల్లయప్పర్ ఆలయ రథం


సిద్ధమవుతున్న రథం

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి పట్టణంలోని నెల్లయప్పర్ ఆలయ రథం అందంగా ముస్తాబవుతోంది. ఈ ఆలయంలో జరిగే వేడుకల్లో ఆణి ఉత్సవాలు ప్రసిద్ధి చెందాయి. ఈ నెల 30వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్న ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం తొమ్మిదవ రోజైన జూన్ 8వ తేది జరగనుంది. ఉత్సవంలో స్వామిఅమ్మవారు, వినాయకుడు, మురుగన్, చండీకేశ్వరుడు ఐదు రథాల్లో మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రథం లాగేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలో, నెలరోజులుగా రథాలకు మరమ్మతులు జరుగుతున్నాయి. రథం వీధిలో నిలిపిన రథంపై అగ్నిమాపక సిబ్బంది నీరు చల్లి శుభ్రం చేశారు. అనంతరం రథం చుట్టూ కర్రలు ఏర్పాటుచేసి రంగులద్దే పనులు జరుగుతున్నాయి. అనంతరం బ్రహ్మ గుర్రాలు నడుపుతున్న సహా వివిధరకాల శిల్పాలు రథాలపై ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పొదటూరు పేట బస్టాండ్ పనుల పరిశీలన


పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని పొదటూరు పేటలో జరుగుతున్న నూతన బస్టాండు నిర్మాణ పనులను శుక్రవారం ఉదయం ఆ కలెక్టర్ ప్రతాప్ పరిశీలించారు. రూ.1.50 కోట్లతో ప్రారంభించిన ఈ నూతన బస్టాండు నిర్మాణ పనుల వివరాలను అడిగితెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, నాణ్యతలో రాజీవద్దని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ విషయమై సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం అతిమాంజేరిలో రూ.50 లక్షలతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్మాణంలో ఉన్న ల్యాబ్ పనులను తనిఖీ చేశారు. వైద్యసేవలు, పారిశుద్ధ్యం తదితర వసతుల్లో సమస్యలున్నాయా అని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సహాయ డైరెక్టర్ జయకుమార్, పంచాయతీ కార్యదర్శి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే మద్దతుతో డీఎంకే కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం


అవిశ్వాస తీర్మానం నివేదికను కమిషనర్‌కు అందిస్తున్న కౌన్సిలర్లు (ఇన్‌సెట్‌లో) ఉమా మహేశ్వరి

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ మున్సిపల్ చైర్మన్ ఉమా మహేశ్వరికి వ్యతిరేకంగా డీఎంకే కౌన్సిలర్లే ప్రతిపక్ష అన్నాడీఎంకే మద్దతుతో అవిశ్వాస తీర్మానం తీసుకురావడంపై డీఎంకే అధిష్ఠానం ఆందోళనకు గురైంది. 30 వార్డులున్న శంకరన్‌కోవిల్ మున్సిపాలిటీలో 9 వార్డుల్లో డీఎంకే గెలవగా, అన్నాడీఎంకే 12 వార్డులను చేజిక్కించుకుంది. అయినప్పటికీ మిత్రపక్షాల మద్దతుతో ఈ మున్సిపాలిటీ చైర్మన్ పదవికి జరిగిన ఎన్నికలో తెన్‌కాశి జిల్లా డీఎంకే యువజన విభాగ ఆర్గనైజర్ శరవణన్ భార్య ఉమా మహేశ్వరి ఎంపికయ్యారు. మెజారిటీ సీట్లను బట్టి వైస్ చైర్మన్‌గా అన్నాడీఎంకేకు చెందిన రాజు ఎంపికయ్యారు. ప్రారంభం నుంచే ఉమామహేశ్వరికి, డీఎంకే కౌన్సిలర్లకు విభేదాలున్న కారణంగా ఆమెను పదవి నుంచి ఎలాగైనా తప్పించాలని డీఎంకే కౌన్సిలర్లు కంకణం కట్టుకున్నారు. కౌన్సిల్ సమావేశంలో తీర్మానాలు నెరవేర్చలేని పరిస్థితిలో ఉమా మహేశ్వరి తలకిందులయ్యారు. గత డిసెంబరులో ఆమెకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని జిల్లాకు చెందిన మంత్రి జోక్యం చేసుకుని ఓటింగ్ జరగకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో, ప్రజలకు కనీస వసతులు కల్పించలేదని, ప్రతినెలా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించడం లేదని, మున్సిపాలిటీలో అవినీతి పెరిగిందంటూ డీఎంకే కౌన్సిలర్లు అన్నాడీఎంకేకు చెందిన కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని శుక్రవారం శంకరన్‌కోవిల్ మున్సిపాలిటీ కమిషనర్‌కు సమర్పించారు. దీనికి సంబంధించిన ఓటింగ్ జూలై 2వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

4న టీవీకే కార్యనిర్వాహక కమిటీ సమావేశం

పెరంబూర్,జూన్27(ఆంధ్రజ్యోతి):తమిళగ వెట్రికళగం (టీవీకే) కార్యనిర్వాహక కమిటీ సమావేశం జూలై 4న ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ అధ్యక్షతన జరగనుంది. స్థానిక పనయూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు సమావేశం జరుగనుంది. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సినచర్యలు,పార్టీ అధ్యక్షుడు ప్రజలను కలుసుకునేలా కార్యక్రమాల రూపకల్పన సహా పలు అంశాలపై చర్చిం చనున్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య కార్యనిర్వాహకులు, ప్రత్యేక కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యనిర్వాహకులు, మండలాల బాధ్యులు, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర సమన్వయకర్తలు మాత్రమే పాల్గొననున్నారు.

కోవై ఆస్పత్రిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సతీమణికి చికిత్స

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సతీమణి సావిత్రిసింగ్ (72) వెన్నెముక సమస్యకు చికిత్స పొందేందుకు కోయంబత్తూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆమెకు వైద్య బృందం పరీక్షలు నిర్వహిస్తోంది. ఆమె వెంట కుమార్తె, కుమారుడు, ఎమ్మెల్యే పంకజ్‌సింగ్ ఉన్నారు. భార్యను పరామర్శించేందుకు రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కోవై వస్తారని సమాచారం.

మారియమ్మన్ ఆలయ హుండీ ఆదాయం రూ.91 లక్షలు

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి మారియమ్మన్ ఆలయాన్ని ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. అలాగే, అమ్మవారికి నగదు, బంగారం, వెండి తదితరాలు కానుకలను ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో సమర్పిస్తుంటారు. హుండీలు నిండిన అనంతరం ఆలయ నిర్వాహకులు లెక్కిస్తుంటారు. ఈ నేపథ్యంలో, గురువారం ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు రూ.91.45 లక్షలు, 1.942 కిలోల బంగారం, 3.280 కిలోల వెండి తదితరాలు కానుకలుగా సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

8వ తరగతి పబ్లిక్ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అభ్యర్థులు 8వ తరగతి పబ్లిక్ పరీక్షలకు జూలై 10 నుంచి 17వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్ష శాఖ డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రైవేటు అభ్యర్థుల 8వ తరగతి పరీక్షలు ఆగస్టు 18 నుంచి 22వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలు రాసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై 10 నుంచి 17వ తేది వరకు సేవా కేంద్రాల ద్వారా www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫీజుగా రూ.125, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.70 సేవా కేంద్రాల ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలోపు దరఖాస్తు చేసుకోలేని వారు రూ.500 అదనపు రుసుముతో 18,19 తేదీల్లో తత్కాల్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. మొదటి సారి పరీక్ష రాసే వారు తమ పాఠశాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, పాఠశాల బదిలీ ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రాల్లో ఏదైనా ఒక సర్టిఫికేట్ నకలు దరఖాస్తుతో పంపించాలని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

30న ప్లస్‌వన్ రీ వాల్యుయేషన్ జాబితా విడుదల

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి రీ టోటలింగ్, రీ వాల్యుయేషన్ జాబితా ఈ నెల 30వ తేది విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ పేర్కొంది. ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన వారు, తమ జవాబు పత్రాలకు మళ్లీ మూల్యాకనం చేసేందుకు, మార్కులు లెక్కించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫలితాలను ఈనెల 30వ తేది మధ్యాహ్నం www.dge.tn.gov.in లో కానీ, Notificationలో విడుదల చేయనున్నారు. దరఖాస్తుదారులు తమ పరీక్ష రిజిస్ట్రేషన్ నెంబరు, పుట్టిన తేది నమోదుచేసి ఫలితాలు తెలుసుకోవచ్చని పరీక్ష శాఖ తెలిపింది.

ఎన్డీఏ కూటమిలో ఈపీఎస్‌దే తుది నిర్ణయం

● మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నిర్ణయం తీసుకుంటారని, ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోవని మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమిలో బీజేపీ చేరడంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమిళనాడులో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమిత్‌షా వ్యాఖ్యలపై స్పందించిన రాజేంద్ర బాలాజీ శుక్రవారం పుదుకోటలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. 2026 లో రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సీఎం అభ్యర్థి ఎడప్పాడి పళనిస్వామి అని బీజేపీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. అధికార డీఎంకేను వ్యతిరేకించే పార్టీలను కూటమిలో చేర్చుకునేందుకు ఎడప్పాడి పళనిస్వామి చేపట్టిన ప్రయత్నాలు తప్పక ఫలిస్తాయని ఆయన తెలిపారు.

గుట్కా విక్రేతల అరెస్టు

తిరుత్తణి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి నేషనల్ హైవేపై గుట్కా బస్తాలను తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రహదారి మీదుగా గుట్కాను చెన్నైకు తరలించేందుకు యత్నించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, తిరుత్తణి ఇన్‌స్పెక్టర్ విచారణలో... తిరువలంగాడుకు చెందిన మూర్తి, రాణిపేటకు చెందిన దామోదరన్ నగర్‌కు చెందిన రవిగా గుర్తించారు. వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై దాడి

భర్తకు మూడు నెలల జైలు

పెరంబూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్‌లో భార్యపై దాడి చేసిన భర్తకు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. తిరుప్పూర్ పులువపట్టికి చెందిన మురుగేశన్(53) 2015లో తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసినట్లు ఆయన భార్య అనుప్పర్‌పాళయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హింస నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు మురుగేశన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారించిన ట్రిబ్యునల్-3... మురుగేశన్‌కు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ 2023లో తీర్పు వెలువరించింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ మురుగేశన్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను గురువారం విచారించిన న్యాయమూర్తి సురేష్.. మురుగేశన్ అప్పీలు పిటిషన్ తోసిపుచ్చడంతో పాటు, దిగువ కోర్టు విధించిన మూడు నెలల జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు.

బడిపిల్లల అల్పాహారంలో బల్లిపడి నలుగురికి అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బడిపిల్లలను పరామర్శిస్తున్న మంత్రి కయల్‌విళి సెల్వరాజ్

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా తారాపురంలో శుక్రవారం బడి పిల్లలకు సరఫరా చేసిన అల్పాహారంలో బల్లి పడి ఉండటంతో దాన్ని తిన్న నలుగురు విద్యార్థులు అస్వస్థత చెందారు. తారాపురం కొళింజివాడి సమీపంలో ఉన్న పురపాలక మాధ్యమిక పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరు రోజూ ఉదయం పూట ప్రభుత్వం అందించే అల్పాహారం భుజిస్తున్నారు. ఈ అల్పాహారాన్ని కాంగేయంలోని పెళ్లిమంటపంలో తయారు చేసి వ్యాన్‌ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం మొదటి విడతగా 40 మంది విద్యార్థులు అల్పాహారం తిన్నారు. ఆ సమయంలో ఓ విద్యార్థి పళ్లెంలో పోసిన సాంబారులో బల్లి కళేబరం కనిపించింది. గమనించిన శరవణన్, సంజిత్, అమేష్, వీరరాజ్ వాంతి చేసుకున్నారు. వెంటనే ఉపాధ్యాయులు విద్యార్థులను తారాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి కయల్‌విళి సెల్వరాజ్ చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అల్పాహారంలో బల్లిపడిన ఘటనపై ఉన్నతాధికారుల విచారణ జరుగుతుందని ఆమె తెలిపారు.

సిలిండర్ పేలి వంటగది ధ్వంసం


సిలిండర్ పేలడంతో ధ్వంసమైన వంటగది

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వేడచందూరు సమీపంలోని పాలపట్టి ప్రభుత్వ పాఠశాలలో బడిపిల్లల పౌష్టికాహార పథకం వంటగదిలో శుక్రవారం ఉదయం సిలిండర్ పేలడంతో ఆ గది పూర్తిగా ధ్వంసమైంది. ఆ వంటగదిలో రోజూ ఇద్దరు మహిళలు పనిచేస్తుంటారు. ఆ మహిళలు వంట చేయడానికి గ్యాస్ స్టౌను వెలిగించినపుడు గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే ఇద్దరు మహిళలు గది నుండి బయటకు పరుగులు తీశారు. క్షణాల్లో సిలిండర్ పేలింది. ఆ పేలుడులో వంటగది ధ్వంసమైంది. ఈ సమాచారం తెలుసుకుని అగ్నిమాపక శాఖ అధికారులు ఆ స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ఉచిత ఇంటి కరెంటు బిల్లు రూ.67 వేలు

జాలరి కుటుంబం షాక్


కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన జాలరి కుటుంబం

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సునామీ కారణంగా నష్టపోయిన జాలరి కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం ఉచితంగా కేటాయించిన ఇంటికి రూ.67వేలు కరెంటు బిల్లు రావడంతో ఆ కుటుంబం షాక్‌కు గురైంది. రామేశ్వరం సమీపంలోని మండపం సముద్రతీరంలో సునామీ బాధితుల కోసం రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇళ్లు నిర్మించి అందజేసింది. వేదాలై ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన ఇంట్లో జాలరి షేక్ జమాలుద్దీన్ కుటుంబం నివసిస్తోంది. వారికి ఈ నెల విద్యుత్ బిల్లు రూ.67వేలు రావడంతో చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన ఆ విద్యుత్ బిల్లుతో రామనాథపురం కలెక్టర్ కార్యాలయానికి శుక్రవారం కుటంబసభ్యులతో వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా షేక్ జమాలుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. రూ.67వేలు చెల్లించాలని విద్యుత్ బోర్డు అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు.

లారీ పరిశ్రమను ఆదుకోవాలి

ఆల్ ఇండియా మోటర్ సర్వీస్ అధ్యక్షుడు జయకుమార్ నాయుడు


మీడియా సమావేశంలో జయకుమార్ నాయుడు

ప్యారీస్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి దూరప్రాంతాలకు సరుకులు తర లించే లారీలకు భద్రత కల్పించడంతో పాటు నష్టాల బాటలో పయనిస్తున్న తమ పరిశ్రమను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆదుకోవాలని ఆల్ ఇండియా మోటర్ సర్వీస్ (ఏఐఎంఎస్) అధ్యక్షుడు లయన్ వీజీ జయకుమార్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఏఐఎంఎస్ నిర్వహణలో నూతనంగా మోటర్ వెలిచమ్ సంఘ ప్రారంభోత్సవం, జెండా పరిచయం, నూతన కార్యవర్గ కమిటీ నిర్వాహకుల ప్రమాణస్వీకారం శుక్రవారం అన్నాసాలైలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో జయకుమార్ నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 38 జిల్లాలకు మోటర్ వెలిచమ్ సంఘ నిర్వాహకులతో రాష్ట్రస్థాయి తొలి సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశం ఆమోదించిన తీర్మానాలను జయకుమార్ నాయుడు మీడియాకు వివరించారు. లారీ అద్దె పెంచాలని, డ్రైవర్లు, క్లీనర్లు, లారీ యజమానులకు కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో లీజు గడువు ముగిసిన 39 టోల్‌ప్లాజాలను మూసివేయాలని, టోల్‌పన్ను ముందుగానే చెల్లిస్తున్న తమకు రాయితీలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరన్, ట్రెజరర్ డి.రవిచంద్రన్, సలహాదారుడు బీవీ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బి.బాలాజీ, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్రేతర తెలుగు సమాఖ్య జాతీయ సదస్సు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు తెలుగు నేర్పించే ప్రయత్నం విజయవంతం కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య (రాతెస), కొచ్చిన్‌కు చెందిన ఆంధ్ర సాంస్కృతిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాతెస దశమ వార్షికోత్సవం కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో కడవంత్రలోని గిరినగర్ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది. 27, 28 తేదీల్లో సదస్సు జరగనుంది. ఇందులో భాగంగా 27వ తేదీ ప్రతినిధుల నమోదుతో సదస్సు ప్రారంభమైంది. అనంతరం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు వి.నిత్యానంద రావు ముఖ్య అతిథిగా, డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి సమన్వయకర్తగా సాహిత్య గోష్ఠి జరిగింది. కొచ్చిన్ ఆంధ్ర సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఎం.హరినాయుడు సభకు స్వాగతం పలికారు. రాతెస అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు అధ్యక్షోపాన్యాసం చేశారు. దీనికి మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాతెస వివిధ రాష్ట్రాలలోని తెలుగు పిల్లలకు, పెద్దలకు తెలుగు నేర్పాలనే దృఢసంకల్పంతో తెలుగు వాచక రచనకు పూనుకుందని, హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం, అంతర్జాతీయ తెలుగు కేంద్రం పూర్వ సంచాలకుడు డాక్టర్ డి.మునిరత్నం నాయుడు నేతృత్వంలో తెలుగు వాచక రచన జరిగిందన్నారు. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య కార్యదర్శి పి.వి.పి.సి ప్రసాద్ వందన సమర్పణ చేశారు.